పని ఫుల్.. జీతాలు నిల్

- మూడు నెలలుగా అందని జీతాలు
- దుర్భర పరిస్థితుల్లో క్లాప్ ఆటో డ్రైవర్ల జీవితాలు
- తక్షణం వేతనాలు చెల్లించాలంటూ వేడుకోలు



చెత్తను వాహనంలో వేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ (ఫైల్)



జీతాలు చెల్లించాలంటూ ఆందోళన చేస్తున్న డ్రైవర్లు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): రెక్కాడితేగాని డొక్కాడని బ్రతుకులు..చాలీ చాలని వేతనాలు.. అయినా పని మాత్రం ఫుల్..ఇంత చేసినా జీతాలు నిల్. ఏలూరు నగర పాలక సంస్థలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లు ఇలాంటి విచిత్ర పరిస్థితుల్లో కాలం గడుపుతున్నారు. గత మూడు నెలలుగా వీరికి వేతనాలు చెల్లించకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా తమకు బకాయి జీతాలను తక్షణం చెల్లించి ఆదుకోవాలని క్లాప్ ఆటో డ్రైవర్లు ఇప్పటికే తమ ఆందోళనను వివిధ రూపాల్లో తెలియపర్చిన డ్రైవర్లు నగరపాలక సంస్థ అధికారులకు సైతం తమ గోడును వినతి పత్రం రూపంలో అందించారు. ఇచ్చేదే నామ మాత్రపు వేతనం పైగా నెలనెలా చెల్లించని పరిస్థితుల్లో వీరు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. పాలకులు తమ సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలంటూ క్లాప్ ఆటో డ్రైవర్లు కోరుతున్నారు. మూడు నెలల జీతాల బకాయిలు, జనవరి నుంచి బకాయి ఉన్న పీఎఫ్, ఈఎస్ఐలను బకాయిలను ఖాతాల్లో జమ చేయాలని కోరుతున్నారు.

జీఓలో రూ.18,500

ఇచ్చేది మాత్రం రూ.12 వేలే

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం క్లాప్ ఆటో డ్రైవర్లకు నెలకు రూ.18,500 వేతనం చెల్లించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం వాస్తవంగా వీరికి చెల్లించేది మాత్రం రూ.12 వేలు మాత్రమే. అదీ నెలనెలా ఖచ్చితంగా చెల్లించకపోవడంతో వీరు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూలు,కాలేజీ ఫీజులు కట్టలేకపోతున్నారు. నిత్యావసర సరుకులను కొనుగోలు చేయాలన్నా అప్పులే ఆధారంగా మారాయి. తమకు తక్షణం వేతనాలు చెల్లించాలని లేని పక్షంలో వచ్చే నెల 4 నుంచి తమసేవలను నిలుపుదల చేసి నిరవధిక సమ్మెకు దిగుతామంటూ క్లాప్ ఆటో డ్రైవర్లు హెచ్చరిస్తున్నారు.

అప్పుడు 90.. ఇప్పుడు 60

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో క్లాప్ వాహనాలు ప్రారంభించిన తొలిరోజుల్లో మొత్తం 90 వాహనాలు సేవలు అందించేవి. తాజాగా వాటి సంఖ్య 60కి చేరింది. దాదాపు 30 వాహనాలు రిపేర్లు వచ్చి మూలన పడ్డాయి. వీటిని సరిచేసి తిరిగి రోడ్లు మీద తిరిగేలా చేయడంలోనూ కార్పొరేషన్ అధికారులు అలసత్వం వహిస్తున్నారు అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

క్లాప్ డ్రైవర్ల వేతన బకాయిలు చెల్లించాలి



ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని క్లాప్ ఆటో డ్రైవర్లకు చెల్లించాల్సిన వేతన బకాయిలను తక్షణం చెల్లించాలి. క్లాప్ ఆటో డ్రైవర్లు విధించిన డెడ్‌లైన్ లోపు వారికి వేతనాలు చెల్లించాలి. లేని పక్షంలో క్లాప్ ఆటో డ్రైవర్లు చేసే ఆందోళనకు నగర పాలక సంస్థ అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. చిరు ఉద్యోగులపై సానుకూలంగా అధికారులు ఆలోచించి వారి సమస్యను పరిష్కరించాలి. – బి.సోమయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు,ఏలూరు

మూడు నెలల నుంచి అవస్థలు



మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఖర్చుల నుండి కాపాడుకోవడానికి, కుటుంబాన్ని పోషించుకునేందుకు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఒక రకంగా చెప్పాలంటూ నగరపాలక సంస్థ లో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల రోజులు చాలా దుర్భరంగా గడుస్తున్నాయి. తక్షణం వేతన బకాయిలు చెల్లించి ఆదుకోవాలి.

– ఎం.పుష్పరాజ్, క్లాప్ ఆటో డ్రైవర్,ఏలూరు నగరపాలక సంస్థ

క్లుప్తంగా

వృద్ధులకు ట్రై సైకిల్స్, దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు, ట్రైసైకిల్స్ అందజేస్తున్న పిశపాటి సీతారామన్

ఏలూరు (టూటౌన్): స్థానిక పత్తేబాదలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదిఆవరం ట్రైసైకిల్స్, దుస్తులు,చేతికర్రలు అందజేశారు. పిశపాటి పార్థసారధి జ్ఞాపకార్థం వారి కుమారుడు సీతారామన్ వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు నాగం శివ మాట్లాడుతూ ఆశ్రమంలోని వృద్ధులకు రెండు ట్రైసైకిల్స్, యాడ్ స్టిక్స్, దుస్తులు, స్వీట్లు పంపిణీచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బర్మా లక్ష్మణరావు, మహిళా మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి కుసుమ కుమార్, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డీలర్ షిప్ ఇప్పిస్తానని మోసం

ఏలూరు టౌన్: ఏలూరు శాంతినగర్ 8వ రోడ్డుకు చెందిన కోనా ధనవెంకట సత్యనారాయణ వ్యాపారం పెట్టేందుకు ఆలోచన చేస్తుండగా అదే సమయంలో అమరావతి రాజేష్ అనే వ్యక్తి ఫోన్‌లో పరిచయం అయ్యాడు. సత్యనారాయణకు మెడికల్ ఏజెన్సీ ఏలూరులో నిర్వహించేందుకు అనుమతులు కోసం రూ.1లక్ష 25వేలు చెల్లించాలని నమ్మించాడు. తనవద్దే మందులు కొనుగోలు చేయాలని రాజేష్ చెప్పాడు. అతని మాటలు నమ్మిన సత్యనారాయణ అడిగిన సొమ్మును చెల్లించాడు. కానీ మెడికల్ ఏజెన్సీ పెట్టేందుకు ఎలాంటి అనుమతులు లేకపోగా రాజేష్ ఫోన్ స్విచ్ఛాఫ్ రావటంతో మోసపోయానని గుర్తించి ఆదివారం ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఏలూరు త్రీటౌన్ సీఐ ఎస్.కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి దివాళితో మైభారత్ సేవా కార్యక్రమాలు

ఏలూరు రూరల్: దివాళితో మైభారత్ సేవా కార్యక్రమాలు సోమవారం నుంచి 30వ తేదీ వరకు చేపట్టనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి దూలం కిషోర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మైభారత్ కార్యక్రమం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు కార్యక్రమాలు రూపొందించామని పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, సేవా సంఘాల సహకారంతో మార్కెట్లు శుభ్రపరచడం, ట్రాఫిక్ నియంత్రణ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు సేవలు తదితర పనులు చేపడతామని వివరించారు. 28న ఏలూరులో పత్తేబాద్ రైతుబజారు, నిమ్మకాయల మర్కెట్ శుభ్రత, పెద్దాసుపత్రి వద్ద రోగులకు సేవలతో కార్యక్రమం ప్రారంభమవుతుందని వివరించారు. కళాశాల విద్యార్థులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

గంగానమ్మ సేవలో జేపీ



జేపీకి అమ్మవారి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గంగానమ్మ వారి అనుగ్రహం నగర ప్రజలపై ఉండాలని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మామిళ్ళపల్లి జయప్రకాష్ (జేపీ) అన్నారు. ఆదివారం స్థానిక సత్యనారాయణ పేట 3వ డివిజన్‌లో ఉన్న శ్రీ గంగనమ్మ అమ్మవారికి నిర్వహించిన సంబర మహోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన మెండుగా ఉందని, ప్రతి ఏటా నగరంలోని పలు పేటల్లో అమ్మవార్ల సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలను చాటుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను జయప్రకాష్‌కు అందజేసి వేద ఆశీర్వచనం పలికారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను శాలువాతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పల్లి శ్రీను, మాజీ కౌన్సిలర్ పేటేటి పాండు రంగారావు,వైసీపీ నాయకులు రెళ్ళ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏసు మార్గం అనుసరణీయం



సెయింట్ పాల్స్ లూథరన్ చర్చ్‌ను ప్రారంభిస్తున్న బిషప్ పరదేశి బాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విశ్వశాంతి కోసం, లోక రక్షణ కోసం ఏసు ప్రభువు సూచించిన మార్గం ప్రతీ ఒక్కరికీ అనుసరణీయమని గుంటూరు ఆంధ్రా ఇవాంజలికల్ లూథరన్ చర్చ్ (ఏఈఎల్‌సీ) మోడరేటర్ బిషప్ కేఎఫ్ పరదేశి బాబు సూచించారు. స్థానిక అమీనాపేటలోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చ్ ఆధునికరణ అనంతరం సెంట్రల్ ఏసీ సౌకర్యాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక బాటలో పయనించాలని, తోటివారితో సోదర భావంతో మెలుగుతూ మత సామరస్యం నెలకొల్పడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఎల్‌సీ ప్రథహ మహిళ ఆశా కిరణ్ పరదేశిబాబు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ కె.రవితేజ్, ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేఎం అంబేద్కర్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల అయ్యప్ప క్షేత్రంలో మాలధారులకు బిక్ష



బాల అయ్యప్ప క్షేత్రంలో భిక్ష కార్యక్రమం ప్రారంభిస్తున్న క్షేత్రం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దొండపాడు శ్రీ బాల అయ్యప్ప క్షేత్రంలో శ్రీ అయ్యప్ప స్వామి మండల దీక్ష స్వాములకు 13వ వార్షిక బిక్ష కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ఆలయంలో ఉదయం శ్రీ బాల అయ్యప్ప స్వామి వారికి పంచామృత అభిషేకం, విశేష అలంకరణ చేశారు. ఉదయం 8 గంటలకు శ్రీ లక్ష్మీ గణపతి హోమం, అయ్యప్ప తారక మంత్ర హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షేత్రం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి రోజూ మధ్యాహ్నం 12 గంటలకు బిక్ష ప్రదాత ద్వారా స్వామి వారికి పూజ, మహా నైవేద్యం, మహా హారతి నిర్వహించి అనంతరం మాలధారులకు బిక్ష అందజేస్తామన్నారు.

గరికపాటి ఆర్ట్స్ సేవలు చిరస్మరణీయం



గుడిపాటి లలితకు ఏఎన్ఆర్ పురస్కారం అందిస్తున్న అతిథులు



లలిత సంగీత కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో కళలను ఆదరిస్తూ, కళాకారులను విశేషంగా ప్రోత్సహిస్తున్న గరికపాటి ఆర్ట్స్ థియేటర్ సేవలు చిరస్మరణీయమని సినీ విజ్ఞాన విశారద, నంది అవార్డు గ్రహీత ఎస్‌వీ రామారావు అన్నారు. ఆదివారం స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి, పుల్లాభొట్ల శ్రీరామమూర్తి ప్రాంగణంలో గరికపాటి ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏఎన్ఆర్ పురస్కార ప్రదాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కళా సంస్థ 50 కార్యక్రమాలు నిర్వహించడమే విశేషంగా చెప్పుకుంటామని, అలాంటిది గరికపాటి ఆర్ట్స్ థియేటర్ సంస్థ ఇప్పటి వరకూ 269 కార్యక్రమాలు నిర్వహించడం ఒక రికార్డుగా నిలుస్తుందన్నారు. కాగా గత పదేళ్లుగా కళారంగంలో ప్రఖ్యాతి గాంచిన కళాకారులకు ఏఎన్ఆర్ అవార్డును అందిస్తూ వారిని గౌరవించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ గరికపాటి కాళిదాసు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా గత పదేళ్లుగా ఏఎన్ఆర్ అవార్డును అందచేసేందుకు అవకాశం కల్పించిన ఎస్‌వీ రామారావుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ సంస్థ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తూ కళలకు జీవం పోయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఏఎన్ఆర్ పురస్కార గ్రహీత గుడిపాటి లలిత మాట్లాడుతూ తనను ఏఎన్ఆర్ పురస్కారానికి ఎంపిక చేయటం ఆనందదాయకమన్నారు. అనంతరం నగరానికి చెందిన వేదుల జయలక్ష్మి, గుడిపాటి రత్న శిరీష గుడిపాటి విశ్వనాథ్ ఆలపించిన లలిత సంగీత కార్యక్రమంగా అమ్మవారి కీర్తనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి వారికి పి.సుధీర్, కె.కల్యాణ్ (తబలా) వాయిద్య సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు, రిటైర్డ్ ప్రొఫెసర్ డి.సరస్వతి, రిటైర్డ్ ఫిజిక్స్ హెచ్‌ఓడీ పి.సుబ్బలక్ష్మి, నంది అవార్డు గ్రహీత ఎండీ ఖాజీవలి, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ, ఎంవీఆర్ఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కార్మికులకు పక్కా ఇళ్లు నిర్మించాలి



పొగాకు పనివారల సంఘం జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న కన్నబాబు

ఏలూరు (టూటౌన్): పొగాకు కార్మికులకు ఇళ్ల స్థలాలు లేని వారికి స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు కోరారు. పొగాకు పనివారల సంఘం జనరల్ బాడీ సమావేశం యూనియన్ నాయకులు గోళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ ఏలూరులో మాజీ ఎమ్మెల్యే సీపీఐ నాయకులు అత్తులూరి సర్వేశ్వరరావు స్థాపించిన ఏఐటీయూసీ అనుబంధ పొగాకు పని వారల సంఘంలో ఉన్న కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ముందుగా ఇటీవల మరణించిన యూనియన్ అధ్యక్షుడు జోగి నాగేశ్వరరావుకు నివాళులర్పించారు. జోగి నాగేశ్వరరావు స్థానంలో సంఘం అధ్యక్షుడిగా బి.పోతురాజుని సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ పొగాకు పనివారిలో ఎక్కువమంది అనారోగ్యానికి గురవుతున్నారని వారికి సంబంధించి 50 సంవత్సరాలు పూర్తవగానే వృద్ధాప్య పెన్షన్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 31వ తేదీన ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా స్థానిక వైఎంహెచ్ఏ సెంటర్లో ఏఐటీయూసీ పతాకాన్ని ఉదయం 9:30 గంటలకు ఆవిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం కార్యదర్శి పుప్పాల శ్రీనివాసరావు కోశాధికారి చింతపల్లి కూర్మా రావు, బాపిరాజు ,చిన్ని, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

ఏలూరు రూరల్: ఏలూరు మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల అధికారి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు తెలిపారు. ఆదివారం ఏలూరులో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే సంవత్సరం కాలానికి మండల యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడి పి.సురేష్‌బాబు, సహాధ్యక్షులుగా పి.ముకుందలక్ష్మి, డి.పూర్ణశ్రీ, ప్రధాన కార్యదర్శిగా ఎల్.కనకదుర్గ, కోశాధికారి ఎ.స్వర్ణలత, కార్యదర్శులు పీవీ జనార్ధనరావు, టీఈఎస్‌డి ప్రసాద్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని వెల్లడించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, సుభానిబేగం, బి.మోహనరావు, టి.ఆశయ్య తదితరుల సమక్షంలో కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



ఏలూరు వన్‌టౌన్ స్టేషన్ వద్ద రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సత్యనారాయణ

ఏలూరు టౌన్: నగరంలో నేరాల నిరోధానికి జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో పటిష్టమైన నిఘా ఉంచామనీ, ఇష్టారాజ్యంగా నేరాలకు పాల్పడితే సహించేది లేదని ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ అన్నారు. ఏలూరు వన్‌టౌన్ స్టేషన్ వద్ద ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఒక్కొక్కరితో మాట్లాడుతూ వారి వ్యక్తిగత సమాచారంతో పాటు ఉపాధి మార్గాలు చూసుకుంటూ నేర ప్రవృత్తిని వదులుకోవాలని హితవుపలికారు. అసాంఘిక కార్యకలాపాల్లో ఉంటే భవిష్యత్తు నాశనం అవుతుందనీ, మంచి ప్రవర్తనతో మెలుగుతూ మీ కుటుంబాల పట్ల బాధ్యతగా నడుచుకోవాలని చెప్పారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా కొట్లాటలకు పాల్పడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

ఏలూరు టూటౌన్ పరిధిలో

ఏలూరు టూటౌన్ పరిధిలో రౌడీషీటర్లకు టూటౌన్ ఎస్సై లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. టూటౌన్‌లోని రౌడీషీటర్లు అందరినీ స్టేషన్‌కు పిలిచి వారు సమాచారాన్ని తెలుసుకున్నారు. ఏదైనా సంఘ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవన్నారు. మంచి నడవడికతో మీ కుటుంబాలను పోషించుకునేందుకు మంచి ఉపాధి మార్గాన్ని ఎంచుకోవాలని తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	21

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	21
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	29
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	28
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	37
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - తిరుపతి	16.00	4830	24

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36-42	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	64	చిక్కుడు కాయలు	00
వంకాయలు (కాంతులు)	40-72	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	56-64	ములక్కాడలు	07,10
బెండకాయలు	52-56	కంద	60
పచ్చిమిర్చి	40-52	బీట్‌రూట్	40-48
కాకర కాయలు	46-64	కీరా దోస	36
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	00
బీరకాయలు (పందిరి)	60	అల్లం	80
క్యాబేజీ	32-36	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	50-60	పాలకూర	15
దొండకాయలు	34	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	40,50,55	గోంగూర	07
గోరుచిక్కుడు	50	పుదీనా	05
దోసకాయలు	40-48	బఠాణీ	--
ఆనబకాయ (1)	30-40	క్యాప్సికమ్	84-96
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	36

పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు

భీమడోలు: గ్రామాల్లో పుట్ట గొడుగుల్లా గొలుసు దుకాణాలు వెలిశాయని, ఇదేనా మంచి ప్రభుత్వం అని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, భీమడోలు ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ పేరుతో గ్రామగ్రామాన, ప్రతి వీధిలోను, సంతల్లో బెల్ట్ షాపులను పెట్టి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. చిన్న గ్రామాల్లో సైతం 2, 3 గొలుసు దుకాణాలు ఏర్పాటు చేశారన్నారు. ఇదంతా అబ్కారీ శాఖ పోలీసుల కనుసైగల్లో జరుగుతోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తారని ఎదురుచూస్తుంటే ఇంటింటికీ మద్యాన్ని తీసుకోవచ్చిన ఘనత చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు దక్కుతుందన్నారు. ఎన్నికల హామీలైన ఉచిత ఇసుక, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు రూ.1500, 50 ఏళ్ల నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఫించన్ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని, రాష్ట్రంలో బెల్ట్ దుకాణాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారన్నారు. మద్యం దశల వారీగా అమ్మకాలు తగ్గించారన్నారు. గ్రామాల్లో ప్రజలు విషపు జ్వరాలు డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులతో బాధపడుతున్నా కూటమి ప్రభుత్వం ఎక్కడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయలేదని, కనీసం మందులు ఇచ్చినా పాపాన పోలేదన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని చంద్రబాబు నిర్వీర్యం చేశారని, ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్ట్

జంగారెడ్డిగూడెం: పేకాట స్థావరాలపై జంగారెడ్డి గూడెం పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. స్థానిక ప్రతిభ స్కూల్ సమీపంలో పేకాడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురు జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.7,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే స్థానిక గరుడపక్షి నగర్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 2200 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కొవ్వలిలో..

దెందులూరు: కొవ్వలి గ్రామంలోని చిన్న దళితపేటలో ఆదివారం పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. నిందితుల నుంచి రూ.24,330 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజనుల పోటీ



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాసరావు

ఏలూరు (టూటౌన్): వచ్చే ఏడాది మార్చిలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజనుల నుంచి ఉమ్మడి అభ్యర్థిని పోటీలో నిలుపనున్నట్లు బీసీ చైతన్య వేదిక రాష్ట్రఅధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాసరావు తెలిపారు. బహుజన రాజకీయ పార్టీల, సంస్థల ప్రతినిధులు, ప్రముఖులతో ఎమ్మెల్సీ ఎన్నికలు-బహుజనుల పోటీ అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశంలో ఏలూరులోని యాదవ సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు-పశ్చిమగోదావరి, ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చే మార్చిలో జరగనున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో రెండు చోట్లా బహుజనుల నుంచి అభ్యర్థిని బరిలో నిలుపనున్నట్లు తెలియజేసారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుకు వచ్చే నెల 6 వరకు సమయం ఉన్నందున ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు, లంకా వెంకటేశ్వరరావు, పెరియార్, ఉక్కుసూరి గోపాలకృష్ణ పాల్గొన్నారు.